TELUGU & ENGLISH డిజిటల్ మీడియా | FAST NEWS | VIDEO NEWS | e-PAPER | DIGITAL SERVICES | 24/7

టీ-మీడియా

సామాజికం ... ప్రజల పక్షం ... 24/7 ప్రజా సేవలో...

వార్తలు | వీడియోలు | ఫోటోలు | ఇంటర్వ్యూలు | ప్రజా సమస్యలు | ప్రత్యేక కథనాలు | విశ్లేషణలు

epaper,www.tmedia.net.in | YouTube | facebook

మంగళవారం 27/10/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

ముందు సిద్ధూకు డబ్బులివ్వు.. అప్పుడే చెక్కు

⏭ హైదరాబాద్ కలెక్టరేట్‌లో 'వసూల్ రాణి'..?

టీ మీడియా , అక్టోబర్ 26, హైదరాబాద్ బ్యూరో : పరిహారం పొందాలంటే కమీషన్ చెల్లించాల్సిందేనా? ప్రభుత్వ కార్యాలయంలోనే మధ్యవర్తుల ద్వారా వసూళ్లకు పాల్పడుతున్నారా? హైదరాబాద్ కలెక్టరేట్‌లో ఎలివేటెడ్ కారిడార్ భూసేకరణ పరిహారం పంపిణీ వ్యవహారంపై తీవ్ర ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. భూములు కోల్పోయిన బాధితులకు పరిహారం



అందించాల్సిన (మిగతా 2లో)

ప్రతికూల ప్రభావం లేకపోతే ఓకే!

⏭ తుమ్మిడిహెట్టిపై మహారాష్ట్ర సానుకూలం

టీ మీడియా, అక్టోబర్ 26, హైదరాబాద్ బ్యూరో: తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మించాలన్న తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర సానుకూలంగా స్పందించింది. తమ రాష్ట్రంపై ప్రతికూల ప్రభావం లేకపోతే గతంలో కుదిరిన ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు అభ్యంతరం లేదని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.ముంబయిలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్‌హౌస్‌లో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం ఫడణవీస్‌తో సమావేశమైంది. సాగునీటి అవసరాలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, గిరిజనుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆనకట్ట నిర్మాణానికి సహకరించాలని రేవంత్‌రెడ్డి కోరారు. సమావేశంలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ఇరు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





ముంపుపై సమగ్ర అధ్యయనం

ఆనకట్ట నిర్మాణంతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే ప్రాంతాలు, సాంకేతిక అంశాలు, ఆర్థిక సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఇరు రాష్ట్రాల అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు అంగీకారం కుదిరింది. కేంద్ర జలసంఘం అధ్యయనంతో పాటు ముంపు ప్రభావాన్ని తగ్గించే ప్రత్యామ్నాయాలనూ పరిశీలించాలని నిర్ణయించారు.సమావేశం అనంతరం రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా స్పందిస్తూ చర్చలు ఫలవంతంగా ముగిశాయని తెలిపారు. తెలంగాణ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించిన ఫడణవీస్‌కు కృతజ్ఞతలు చెప్పారు. మహారాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కాపాడుతూనే ఆదిలాబాద్ జిల్లా, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సహకరిస్తానని ఫడణవీస్ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

152 మీటర్ల ఎత్తుతో నిర్మాణంపై ప్రజెంటేషన్

తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మించడం వల్ల కలిగే ప్రయోజనాలను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రాజెక్టు నిర్వహణ వ్యయాన్ని తగ్గించడంతో పాటు గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది.ముంపునకు గురయ్యే మహారాష్ట్ర వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. అక్కడ అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, పరిహార విధానం ప్రకారం రైతులకు నష్టపరిహారం అందించే అంశాన్ని ప్రస్తావించారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ఆశలు

ఉమ్మడి ఆదిలాబాద్ (మిగతా 2లో)

యలహంక భూమి షర్మిలదే!



⏭ జగన్ అన్యాయం చేశాడు : వైఎస్ విజయమ్మ

టీ మీడియా ,అక్టోబర్ 26 , అమరావతి బ్యూరో: బెంగళూరులోని యలహంక భూమి తన కుమార్తె వైఎస్ షర్మిలదేనని దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సతీమణి వైఎస్ విజయమ్మ గతంలోనే స్పష్టం చేశారు. వైఎస్ జగన్ తన సోదరి షర్మిలకు రాసిచ్చిన అవగాహన ఒప్పందం (ఎంవోయూ)లోని ఆస్తులతో పాటు, సరస్వతి సిమెంట్స్ సహా ఆ ఒప్పందంలో ప్రస్తావించని యలహంక భూమి కూడా షర్మిలకే చెందుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి 20న 'క్లారిఫికేషన్' పేరుతో విజయమ్మ విడుదల చేసిన బహిరంగ ప్రకటన తాజాగా మరోసారి చర్చనీయాంశమైంది. నోటరీ చేయించిన అనంతరం ఈ ప్రకటన విడుదల చేసినట్లు సమాచారం.

షర్మిల వివాహ వేదికపై వివాదం

తన కుమార్తె వివాహాన్ని బెంగళూరులోని యలహంక ప్యాలెస్‌లో నిర్వహించాలని షర్మిల నిర్ణయించుకుని, వేదిక వివరాలతో ఆహ్వాన పత్రికలు ముద్రించి బంధుమిత్రులకు పంపినట్లు తెలుస్తోంది. అయితే, అక్కడ వివాహం నిర్వహించడానికి జగన్ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. తాను నివసిస్తున్న ప్రాంగణంలో వివాహం నిర్వహిస్తే భద్రతాపరమైన సమస్యలు తలెత్తవచ్చని, తన నివాసంపై అందరి దృష్టి పడుతుందని జగన్ షర్మిలకు రాసిన లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో యలహంక భూమిపై విజయమ్మ గతంలో చేసిన ప్రకటన సామాజిక మాధ్యమాల్లో మళ్లీ వైరల్‌గా మారింది.

ఆస్తుల పంపకంపై విజయమ్మ వివరణ

వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించే నాటికి ఉన్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులేనని, వాటి పంపకం అప్పటివరకు జరగలేదని విజయమ్మ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఆస్తులను నలుగురు మనవళ్లకు సమానంగా పంచాలన్నది రాజశేఖరరెడ్డి ఉద్దేశమని, ఈ విషయం కుటుంబ సభ్యులందరికీ తెలుసని వెల్లడించారు.

ఎంవోయూలో షర్మిలకు కేటాయించిన ప్రతి ఆస్తి ఆమెకు న్యాయంగా చెందాల్సినదేనని, అందుకే జగన్ ఆమె పేరిట ఆ ఒప్పందం రాశారని విజయమ్మ పేర్కొన్నారు. వాస్తవానికి షర్మిలకు దక్కాల్సిన వాటా కంటే తక్కువే ఇచ్చారని, సరస్వతి సిమెంట్స్‌తో పాటు ఎంవోయూలో ప్రస్తావించని యలహంక భూమి కూడా ఆమెకు చెందుతుందని స్పష్టం చేశారు. జగన్ షర్మిలకు ఇచ్చినట్లు చెబుతున్న డబ్బు ఆమె వాటాకు సంబంధించిన డివిడెండ్ మాత్రమేనని ఆమె తన ప్రకటనలో పేర్కొన్నారు.

మేనల్లుడు, మేనకోడలికి న్యాయం జరగాలి

ఆస్తుల విషయంలో జగన్ తన మేనల్లుడు, మేనకోడలికి ఇప్పటివరకు అన్యాయం చేశారని, భవిష్యత్తులోనైనా వారికి న్యాయం చేస్తారని తల్లిగా ఆశిస్తున్నట్లు విజయమ్మ తెలిపారు. షర్మిలకు (మిగతా 2లో)

పార్లమెంట్ సమీపంలో అగ్నిప్రమాదం



⏭ ఆరు ఫైర్ ఇంజిన్లతో మంటలు అదుపు

టీ మీడియా, అక్టోబర్ 26, న్యూఢిల్లీ బ్యూరో: దేశ రాజధాని ఢిల్లీలోని పార్లమెంట్ సమీపంలో ఉన్న నార్త్ బ్లాక్ భవనంలో సోమవారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. భవనం వెనుక వైపు నుంచి దట్టమైన నల్లటి పొగలు వెలువడటంతో అక్కడ కలకలం రేగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది వెంటనే స్పందించి ఆరు ఫైర్ ఇంజిన్లతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని అధికారులు వెల్లడించారు.

వెల్డింగ్ పనులే కారణమా?

నార్త్ బ్లాక్ భవనంలో ప్రస్తుతం మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భవనం పైకప్పుపై కార్మికులు వెల్డింగ్ పనులు చేస్తున్న సమయంలో మంటలు చెలరేగినట్లు ప్రాథమిక సమాచారం. అక్కడ ఏర్పాటు చేసిన ఏసీ బాయిలర్ సమీపంలో మంటలు ప్రారంభమైనట్లు అగ్నిమాపక శాఖ తెలిపింది. వెల్డింగ్ పనుల సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. అయితే, ప్రమాదానికి అసలు కారణం (మిగతా 2లో)

అర్నాబ్ తుపాను ప్రభావం



⏭ తెలంగాణకు భారీ వర్ష సూచన

టీ మీడియా , అక్టోబర్ 26, హైదరాబాద్ బ్యూరో : వర్షాలు లేక ఎండిపోతున్న పంటలు చూసి అల్లాడుతున్న రైతులకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం శుభవార్త చెప్పింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నాబ్ తుపాను ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో (మిగతా 2లో)


స్కూళ్ల గుర్తింపు పేరుతో రూ.100 కోట్ల వసూళ్ల ఆరోపణ

⏭ మాజీ విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యమొళి అరెస్ట్

టీ మీడియా, అక్టోబర్ 26, చెన్నై బ్యూరో: తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వ గుర్తింపు, పాఠశాలల ఉన్నతీకరణకు అనుమతులు, ఇతర చట్టపరమైన క్లియరెన్సులు ఇప్పిస్తామనే పేరుతో రూ.100 కోట్లకు పైగా వసూలు చేసినట్లు వచ్చిన ఆరోపణల కేసులో మాజీ పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యమొళిని చెన్నై పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై పోలీసుల సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ ఈ చర్య తీసుకుంది. మద్రాస్ హైకోర్టు ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించిన కొద్ది గంటల్లోనే అరెస్టు జరగడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన వ్యవహారం

తమిళనాడు ప్రైవేట్ పాఠశాలల సంఘాల సమాఖ్య కార్యదర్శి డి.సి. ఇళంగోవన్ చేసిన ఫిర్యాదుతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు శాశ్వత ప్రభుత్వ గుర్తింపు, పాఠశాలల స్థాయి పెంపునకు అనుమతులు, భవన నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, పట్టణ మరియు గ్రామీణ ప్రణాళిక డైరెక్టరేట్ (మిగతా 2లో)



అర్నాబ్ తుపాను ప్రభావం

(మొదటి పేజీ తరువాయి)

రేపు, ఎల్లుండి వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది. రేపు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటలకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది.

ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలను జారీ

ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబ్ బాద్ జిల్లాల్లో అతిభారీ వర్షం పడే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. గంటకు 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. జయశంకర్ భూపాలపల్లి, సూర్యాపేట, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున ఈ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది.

ఆంధ్రప్రదేశ్, యానాం తీరాలను దాటే అవకాశం

అర్నాబ్ తుఫాను సాయంత్రానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో పశ్చిమ–వాయువ్య దిశగా కదులుతూ మరింత బలపడి తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉంది. అనంతరం, రేపటికి అదే ప్రాంతంలో అతి తీవ్ర తుఫానుగా బలపడే అవకాశం ఉంది. ఆ తరువాత ఈ తుఫాను వాయువ్య దిశగా కదులుతూ, ఎల్లుండి ఉదయం నుంచి మధ్యాహ్నానికి ముందు సమయంలో ఏపీలోని బాపట్ల, విశాఖపట్నం మధ్య, యానాం సమీపంలో ఆంధ్రప్రదేశ్, యానాం తీరాలను దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో ఇది అతి తీవ్ర తుఫానుగా ఉండే అవకాశం ఉంది. ఆ సమయంలో గరిష్ఠంగా నిరంతర గాలుల వేగం గంటకు 115--125 కి.మీ. ఉండవచ్చు. గాలుల వేగం అప్పుడప్పుడు గంటకు 140 కి.మీ. వరకు పెరిగే అవకాశం ఉంది.

అప్రమత్తమైన టీజీఎస్పీడీసీఎల్

తుఫాను ప్రభావంపై టీజీఎస్పీడీసీఎల్ అప్రమత్తమైంది. అత్యవసర మరమ్మతులకు సిబ్బంది, సామగ్రి సిద్ధం చేయాలని ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేశ్ వి.పాటిల్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. తుఫాను ప్రభావంతో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో టీజీఎస్పీడీసీఎల్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఎండీ జితేశ్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావాన్ని తక్కువగా అంచనా వేయకుండా, అత్యవసర విధులకు అందుబాటులో ఉండాలని సూచించారు.విద్యుత్ అంతరాయాలను వెంటనే పరిష్కరించేందుకు సిబ్బంది, వాహనాలు, మరమ్మతు సామగ్రిని సిద్ధంగా ఉంచాలని, సర్కిల్, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను అప్రమత్తంగా ఉంచి క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో వేగంతో పాటు భద్రతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. తెగిపడిన విద్యుత్ తీగలను తాకవద్దని, వాటికి దూరంగా ఉండి వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ అంతరాయాలపై ఫిర్యాదుల కోసం 1912 టోల్‌ఫ్రీ నంబర్?ను సంప్రదించాలని సూచించారు.

ముందు సిద్ధూకు డబ్బులివ్వు.. అప్పుడే చెక్కు

(మొదటి పేజీ తరువాయి)

అధికారులే డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి.

పరిహారం కోసం డబ్బుల డిమాండ్?

సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ కోసం భూములు, ప్రైవేట్ ఆస్తులను ప్రభుత్వం సేకరించింది. బాధితులకు పరిహారంగా టీడీఆర్ బాండ్లు అందించాలని తొలుత ప్రతిపాదించినప్పటికీ, భూ యజమానులు నగదు పరిహారం కోరడంతో అధికారులు అందుకు అంగీకరించినట్లు సమాచారం.ప్రాంతాలను బట్టి చదరపు గజానికి రూ.90 వేల నుంచి రూ.1.13 లక్షల వరకు పరిహారం చెల్లించాలని నిర్ణయించినట్లు కథనంలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విడతలవారీగా సుమారు రూ.400 కోట్ల నిధులను విడుదల చేసినట్లు సమాచారం.అయితే, పరిహారం మంజూరైనప్పటి నుంచి కొందరు బాధితుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. భూసేకరణ అధికారిణి తరపున 'సిద్ధూ' అనే ప్రైవేట్ వ్యక్తి డబ్బులు వసూలు చేస్తున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నట్లు సమాచారం.

ఒక్కొక్కరి నుంచి లక్షల రూపాయలు?

తిరుమలగిరి మండలానికి చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.6 లక్షలు, బోయిన్‌పల్లికి చెందిన మరో వ్యక్తి నుంచి రూ.14 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మరికొందరి నుంచి రూ.20 లక్షల వరకు డిమాండ్ చేసినట్లు కథనం పేర్కొంది.డబ్బులు చెల్లించినప్పటికీ చెక్కులు అందకపోవడంతో బాధితులు కలెక్టరేట్‌కు వెళ్లి అధికారులను సంప్రదించినట్లు సమాచారం. తొలుత చెక్కులు ఇస్తామని చెప్పి, ఆ తర్వాత తమను పట్టించుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

'డబ్బులు ఇచ్చిన తర్వాతే చెక్కు'?

భూ పరిహారం చెక్కుల పంపిణీకి సంబంధించి అధికారిణి మాట్లాడినట్లు చెబుతున్న ఫోన్ సంభాషణలు ఈ వ్యవహారంలో కీలకంగా మారాయి. పేర్లలో తప్పులు ఉన్నాయని, పరిహారం కోసం సిఫారసు చేసిన వ్యక్తికి ముందుగా డబ్బులు చెల్లించాలని ఆమె చెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి.అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన పూర్తి ఆధారాలు, ఫోన్ సంభాషణల ప్రామాణికత, సంబంధిత అధికారుల వివరణ స్వతంత్రంగా నిర్ధారించాల్సి ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి వ్యవహారం

డబ్బులు చెల్లించినా చెక్కులు అందకపోవడంతో బాధితులు కలెక్టరేట్‌లో ఉన్నతాధికారులను ఆశ్రయించినట్లు సమాచారం. భూసేకరణ అధికారి వసూళ్ల వ్యవహారంపై ప్రాథమిక ఆధారాలను సేకరిస్తున్నామని ఓ ఉన్నతాధికారి తెలిపినట్లు సమాచారం.

మనస్పర్థలతో కుటుంబాలు విడిపోవద్దు

● ఉచిత కుటుంబ

సలహా కేంద్రం ప్రారంభం

టీ మీడియా ,అక్టోబర్ 26 ,నారాయణఖేడ్:

కుటుంబాల్లో తలెత్తే చిన్న చిన్న మనస్పర్థలు పెద్ద సమస్యలుగా మారి కుటుంబాలు విచ్ఛిన్నం కాకుండా, దంపతులకు సరైన మార్గదర్శకత్వం అందించాలనే లక్ష్యంతో నారాయణఖేడ్‌లో ఉచిత కుటుంబ సలహా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని ఐకేపీ కార్యాలయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో, కమ్యూనిటీ నిర్వహణలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉచిత కుటుంబ సలహా కేంద్రం, జెండర్ రిసోర్స్ సెంటర్‌ను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మారుతున్న సామాజిక పరిస్థితుల్లో చిన్న చిన్న మనస్పర్థల కారణంగా కుటుంబాలు విచ్ఛిన్నం కాకుండా నిపుణులైన కౌన్సెలర్ల ద్వారా ఉచితంగా సలహాలు, సూచనలు అందించడం అభినందనీయమని అన్నారు. కుటుంబ సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి ఈ కేంద్రం దోహదపడుతుందని పేర్కొన్నారు.



మహిళా సాధికారతకు ప్రాధాన్యం

మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, పేదరిక నిర్మూలనతో పాటు మహిళల సామాజిక భద్రత, హక్కుల పరిరక్షణకు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కుటుంబాల్లో నెలకొనే సమస్యలను పరస్పర చర్చలు, అవగాహన, కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించుకునేందుకు ఇలాంటి కేంద్రాలు ఉపయోగపడతాయని తెలిపారు. నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా కుటుంబ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలు, దంపతులకు ఉచిత సలహాలు, సూచనలు అందుబాటులోకి రానున్నాయి. కుటుంబ బంధాలను కాపాడటంతో పాటు మహిళలకు న్యాయం, సమానత్వం, సామాజిక భద్రతపై అవగాహన కల్పించడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యం.

ప్రతికూల ప్రభావం లేకపోతే ఓకే!

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాలోని గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సాగునీరు, తాగునీటి సమస్యలను రేవంత్‌రెడ్డి సమావేశంలో వివరించారు. తెలంగాణ, మహారాష్ట్ర మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను ప్రస్తావిస్తూ వెనుకబడిన అటవీ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కుమురం భీం సాగించిన 'జల్, జంగల్, జమీన్' పోరాట స్ఫూర్తిని గుర్తుచేశారు.మహారాష్ట్ర నుంచి సానుకూల స్పందన రావడం ప్రాజెక్టుపై ఆశలు పెంచినప్పటికీ, నిర్మాణానికి తుది నిర్ణయం తీసుకోవడానికి సాంకేతిక అధ్యయనాలు, ముంపు ప్రభావం, పర్యావరణ అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. అధికారుల కమిటీ, కేంద్ర జలసంఘం పరిశీలన అనంతరం ప్రాజెక్టు భవిష్యత్తుపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

యలహంక భూమి షర్మిలదే!

(మొదటి పేజీ తరువాయి)

ఆస్తులు ఇచ్చినట్లుగానే జగన్‌కు కూడా రాజశేఖరరెడ్డి ఆస్తులు ఇచ్చారని, అయితే దాన్ని పూర్తిస్థాయి ఆస్తుల పంపకంగా పరిగణించలేమని ఆమె అభిప్రాయపడ్డారు.ఆస్తుల విషయంలో వాస్తవాలేమిటో దేవుడికి, జగన్‌కు తెలుసని పేర్కొన్న విజయమ్మ, అసత్య ప్రచారాన్ని నిలిపివేయాలని వైఎస్ రాజశేఖరరెడ్డి భార్యగా చేతులు జోడించి విజ్ఞప్తి చేశారు.యలహంక భూమి యాజమాన్యంపై వివాదం, కుటుంబ ఆస్తుల పంపకం, షర్మిల కుమార్తె వివాహ వేదిక అంశాలు వైఎస్ కుటుంబంలో నెలకొన్న విభేదాలను మరోసారి తెరపైకి తెచ్చాయి. అయితే, భూమి యాజమాన్యంపై తుది నిర్ధారణకు సంబంధిత రిజిస్ట్రేషన్ పత్రాలు, చట్టపరమైన ఆధారాలను పరిశీలించాల్సి ఉంటుంది.

ప్రజావాణికి ప్రజల స్పందన కరవు!





సమస్యల పరిష్కార వేదికలో ఖాళీ కుర్చీల దర్శనం

టీ మీడియా , అక్టోబర్ 26 ,కూసుమంచి:

కూసుమంచి మండలంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం వెలవెలబోయింది. ప్రజల సమస్యలు వినేందుకు అధికారులు నిరీక్షించినా.. అర్జీలు సమర్పించేందుకు వచ్చిన బాధితుల సంఖ్య మాత్రం రెండుకే పరిమితమైంది. దీంతో మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేయాల్సిన ప్రజావాణి కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కొరవడిందా? లేక సమస్యల పరిష్కారంపై నమ్మకం తగ్గిందా? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

సోమవారం ఉదయం సుమారు 10.30 గంటలకు ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమం మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగింది. ఈ సమయంలో అధికారులు అందుబాటులో ఉన్నప్పటికీ, భూ సమస్యలకు సంబంధించి ఇద్దరు బాధితులు మాత్రమే తమ దరఖాస్తులను తహసీల్దార్ సైదులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి తాటిపాముల జశ్వంత్ కుమార్‌కు అందజేశారు.

29 శాఖలకు గాను 19 శాఖలే హాజరు

ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 29 ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొనాల్సి ఉండగా, 19 శాఖల ప్రతినిధులు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన 10 శాఖల అధికారులు ఖమ్మంలో నిర్వహిస్తున్న ఎల్‌ఎన్‌ఓ సమావేశానికి వెళ్లినట్లు సమాచారం. హాజరైన వారిలోనూ మండల స్థాయి ఉన్నతాధికారులు ఇద్దరు, ముగ్గురు మాత్రమే ఉండగా, ఇతర శాఖల బాధ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రామాల్లో అవగాహన కల్పించాలి

ప్రతి సోమవారం ప్రజల సమస్యలను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అయితే ఈ కార్యక్రమం గురించి గ్రామీణ ప్రజలకు తగిన సమాచారం అందడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించడంతో పాటు, ప్రతి గ్రామసభలో ప్రజావాణి నిర్వహణ తేదీ, సమయం, దరఖాస్తుల స్వీకరణ విధానం గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజావాణి వంటి కార్యక్రమాలు కేవలం సమావేశాలకే పరిమితం కాకుండా, బాధితులకు ప్రయోజనం చేకూర్చేలా నిర్వహించాల్సిన అవసరం ఉంది. ప్రజల నుంచి అర్జీలు తక్కువగా రావడానికి గల కారణాలను అధికారులు పరిశీలించి, ప్రజల్లో అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ ఉదయశ్రీ, రెవెన్యూ శాఖకు చెందిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ సమీపంలో అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ఏమిటనేది ఇంకా నిర్ధారణ కాలేదు.

11.10 గంటలకు సమాచారం

సోమవారం ఉదయం 11.10 గంటల సమయంలో నార్త్ బ్లాక్ భవనం నుంచి పొగలు వస్తున్నట్లు అగ్నిమాపక శాఖకు సమాచారం అందింది. దీంతో వెంటనే ఆరు అగ్నిమాపక వాహనాలను అక్కడికి పంపించారు. సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. కొద్దిసేపటికే మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు.

నష్టంపై తెలియాల్సి ఉంది

ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, భవనానికి ఎంతమేర నష్టం వాటిల్లిందనే వివరాలు ఇంకా వెల్లడికాలేదు. వెల్డింగ్ పనుల సమయంలో మంటలు ఎలా చెలరేగాయి? ఏసీ బాయిలర్ వద్ద ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు ఏమిటి? అనే అంశాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదానికి కచ్చితమైన కారణాన్ని అధికారులు నిర్ధారించాల్సి ఉంది.

తుఫాన్ కారణంగా టూరిజం బంద్. సిఐ గోపాలకృష్ణ

టీమీడియా,అక్టోబర్26,చింతూరు:

అర్నబ్ తుఫాను కారణంగా చింతూరు మండలంలోని టూరిజం ప్రాంతాలైన పోల్లూరు, ఫోర్ బే, వాటర్ ఫాల్స్, వ్యూ పాయింట్లను బందు చేస్తున్నట్లు, అలాగే మోతుగూడెంలోని టూరిజం రెస్టారెంట్లను మూసివేస్తున్నట్లు సిఐ గోపాలకృష్ణ ప్రకటించారు. జిల్లా ఉన్నతాధికారులైన ఎస్పి చక్రవర్తి, ఎస్ డి ఓ పి ఉదయ పావని ఆదేశాల మేరకు అర్నబ్ తుఫాను కారణంగా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మూసివేస్తున్నట్లు తెలిపారు.



స్కూళ్ల గుర్తింపు పేరుతో రూ.100 కోట్ల వసూళ్ల ఆరోపణ

(మొదటి పేజీ తరువాయి)

క్లియరెన్సులు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులో ఆరోపించారు.ప్రభుత్వంలో తమకు పలుకుబడి ఉందని నమ్మించి పాఠశాలల యాజమాన్యాల నుంచి భారీ మొత్తాలు సేకరించినట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. అయితే, హామీ ఇచ్చిన అనుమతులు మంజూరు కాలేదని, చెల్లించిన డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు.

పార్టీ నిధుల పేరుతో వసూళ్లు?

ఈ వ్యవహారంలో వసూలు చేసిన మొత్తాలను అప్పటి అధికార పార్టీ డీఎంకే నిధులకు విరాళాలుగా సేకరిస్తున్నట్లు చూపించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో బి.టి. అరసకుమార్, మాజీ ఎమ్మెల్యే ముత్తుకుమార్ తదితరుల పాత్రపైనా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.పాఠశాలల యాజమాన్యాల నుంచి సేకరించిన డబ్బు ఎక్కడికి వెళ్లింది? ప్రభుత్వ అనుమతులు ఇప్పిస్తామనే హామీల వెనుక ఎవరెవరి పాత్ర ఉంది? పార్టీ నిధుల పేరుతో నిజంగా ఎంత మొత్తం వసూలైంది? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

ముందస్తు బెయిల్ తిరస్కరణతో అరెస్ట్

ఈ కేసులో మద్రాస్ హైకోర్టును ఆశ్రయించిన అన్బిల్ మహేష్ పొయ్యామొళికి ముందస్తు బెయిల్ లభించలేదు. ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయడానికి హైకోర్టు నిరాకరించిన అనంతరం చెన్నైలోని అమింజికరై ప్రాంతంలో ఆయనను సీసీబీ అధికారులు అరెస్టు చేసినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి.

చెన్నై, తిరుచ్చిలో సోదాలు

కేసు దర్యాప్తులో భాగంగా గతంలో చెన్నై, తిరుచ్చి ప్రాంతాల్లోని పలు ప్రదేశాల్లో సీసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. మాజీ మంత్రికి సంబంధం ఉన్నట్లు పేర్కొన్న ప్రదేశాల్లోనూ తనిఖీలు చేపట్టి కీలక పత్రాలు, ఇతర ఆధారాలను పరిశీలించినట్లు కథనాలు వెల్లడించాయి.ప్రైవేట్ పాఠశాలల నుంచి వసూలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మొత్తానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, అనుమతుల మంజూరు ప్రక్రియ, ఇతర నిందితులతో మాజీ మంత్రికి ఉన్న సంబంధాలపై అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు.

జన్మదిన వేడుకల్లో శాసనసభ్యులు



టీ మీడియా ,అక్టోబర్ 26, నారాయణఖేడ్:
మనూర్ మండల పరిధిలోని దూదగొండ గ్రామ ఆప్తులు శేరి సంగప్ప మనుమరాలు యొక్క జన్మదిన వేడుకలు బసవ మండపం వేదికగా పాల్గొని చిన్నారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఈ కార్యక్రమంలో వారితో శేరి రాజు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,శివ్ కాంత్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, ధనరాజ్ పాటిల్, కుటుంబ సభ్యులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి క్షమాపణ చెప్పాలి



⏭ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ డిమాండ్

టీ మీడియా, అక్టోబర్ 26, పెబ్బేరు:
మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పోలీసు యంత్రాంగానికి క్షమాపణ చెప్పాలని పెబ్బేరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా యువత తరపున ఈ డిమాండ్ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.బాధ్యతాయుతమైన న్యాయవాదిగా, ప్రజాప్రతినిధిగా పనిచేసిన వ్యక్తి సమాజం, చట్టం, వ్యవస్థల పట్ల గౌరవంతో వ్యవహరించాలని రాజేష్ అన్నారు. న్యాయస్థానాలు, పోలీసు వ్యవస్థ ఎవరికీ వ్యక్తిగతంగా అనుకూలంగా పనిచేసే సంస్థలు కావని, ప్రజల రక్షణ కోసం పోలీసు సిబ్బంది నిరంతరం విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు.పోలీసుల పట్ల గౌరవానికి భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటాననే ధోరణిలో మాట్లాడటం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. పోలీసు వ్యవస్థను ఉద్దేశించి అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం వల్ల వ్యవస్థల పట్ల ప్రజల్లో గౌరవం తగ్గే ప్రమాదం ఉందన్నారు.పోలీసు యంత్రాంగం గౌరవాన్ని కాపాడేలా మాజీ మంత్రి తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చి, సంబంధిత పోలీసు అధికారులకు వెంటనే క్షమాపణ చెప్పాలని రాజేష్ డిమాండ్ చేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం



టీ మీడియా ,అక్టోబర్ 26 ,నారాయణఖేడ్:
సిర్గాపూర్ మండలంలో శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గుర్రపు మచ్చేందర్ రూ.2 లక్షల విరాళాన్ని అందించారు. గ్రామ ప్రజల కోరిక మేరకు ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం అందించి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అండగా నిలిచారు.గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఈ విరాళంతో ఆలయ నిర్మాణ పనులకు మరింత తోడ్పాటు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు గుర్రపు మచ్చేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు: సిర్గాపూర్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు తమ బసవరాజు పటేల్, సంజురావు పటేల్, అంజ గౌడ్, సాయిలు, కిరణ్ రావు పటేల్, కృష్ణ డాక్టర్, పుండరికం, సంగమేష్, నామ్దేవ్, చిన్న నారాయణ సెట్, చాకలి సాయిలు, నరేష్ సెట్, హన్మండ్లు, నరేష్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

భర్త ను హత్య చేసిన భార్య

టీ మీడియా ,అక్టోబర్26 ,చింతూరు:
చింతూరు మండలం మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో గల డబ్బగూడెం గ్రామం లో భార్య తన భర్త ను కట్టె తో కొట్టి హత్య చేసింది. సి ఐ గోపాలకృష్ణ కథనం ప్రకారం జల్లి లక్ష్మణరావు, భార్య భద్రమ్మ తరచూ కుటుంబ కలహాలు పడుతూ వుండే వారని, ఆదివారం రాత్రి కూడా తగవు లాడుతున్న భర్త ను కోపం లో కట్టె తీసుకొని తలపై తీవ్రంగా కొట్టడం తో లక్ష్మణరావు మృతి చెందాడని తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు తెలిపారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సి ఐ గోపాలకృష్ణ, ఎస్ఐ నాసిర్ హుస్సేన్ తెలిపారు.



పొలాల్లో చోరీల కలకలం

⏭ 50 మీటర్ల వైర్లు అపహరణ

⏭ రూ.8 వేల నష్టం

టీ మీడియా, అక్టోబర్ 26, దమ్మపేట:
దమ్మపేట మండల కేంద్రంలో వ్యవసాయ మోటర్ల కేబుల్ వైర్ల చోరీలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు ఇద్దరు రైతులకు చెందిన వ్యవసాయ మోటర్ల కేబుళ్లను కత్తిరించి అపహరించడంతో వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడింది. వరుస చోరీలతో పంటలకు సాగునీరు అందించుకోవడం కష్టంగా మారుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దమ్మపేటకు చెందిన రైతులు దారా జనార్ధనరావు, గాజుబోయిన శ్రీనుకు చెందిన రెండు వ్యవసాయ మోటర్ల కేబుల్ వైర్లను ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు కత్తిరించి ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం పొలాలకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతులు కేబుళ్లు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు.

రూ.8 వేల విలువైన వైర్లు మాయం

రెండు మోటర్ల నుంచి సుమారు 25 మీటర్ల చొప్పున మొత్తం 50 మీటర్ల కేబుల్ వైర్లను



దొంగలు అపహరించినట్లు బాధిత రైతులు తెలిపారు. ఒక్కో మీటరు వైరు ధర సుమారు రూ.160 ఉండటంతో చోరీకి గురైన వైర్ల విలువ సుమారు రూ.8 వేలుగా ఉంటుందని పేర్కొన్నారు. వైర్లను తిరిగి ఏర్పాటు చేసుకునేందుకు అదనపు ఖర్చుతోపాటు సమయం కూడా వెచ్చించాల్సి వస్తోందని వాపోయారు.

నిఘా పెంచాలని రైతుల విజ్ఞప్తి

గతంలోనూ పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ మోటర్ల కేబుల్ వైర్ల చోరీలు జరిగినట్లు రైతులు చెబుతున్నారు. పొలాల్లోని మోటర్ల వద్ద భద్రత లేకపోవడంతో దొంగలు సులభంగా వైర్లను అపహరిస్తున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది. వ్యవసాయ సీజన్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే సాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.పోలీసులు వ్యవసాయ పొలాల పరిసరాల్లో నిఘా పెంచి, చోరీలకు పాల్పడుతున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు. వ్యవసాయ మోటర్ల కేబుల్ వైర్ల చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సర్వసభ్య సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యే

⏭ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై సమీక్ష

టీ మీడియా, అక్టోబర్ 26, నారాయణఖేడ్:
కల్హేర్ మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. కల్హేర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ శేట్కర్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్పంచులు, గ్రామ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనుల పురోగతి, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించారు. వివిధ శాఖల అధికారులతో ఆయా శాఖల పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలు, ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు.

ఉపాధి పథకాల అమలుపై ప్రత్యేక చర్చ

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల కల్పన, జీవీబీ రామ్ జీ పథకం అమలు, గ్రామాల అభివృద్ధికి చేపడుతున్న పనులపై ప్రత్యేకంగా చర్చించారు. పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలు, గ్రామీణ ప్రజలకు అందుతున్న



ప్రయోజనాలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించారు.

సమన్వయంతో పనిచేయాలి

ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని, అభివృద్ధి పనులను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం చేపట్టాలని అధికారులకు సూచించారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతోపాటు గ్రామాల అభివృద్ధిని వేగవంతం చేయడంలో మండల స్థాయి సమీక్షా సమావేశాలు కీలకమని పేర్కొన్నారు. గ్రామాల నుంచి వచ్చిన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సమావేశంలో మండల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యాసంగి ప్రణాళికపై రైతులకు అవగాహన

⏭ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

టీ మీడియా ,అక్టోబర్ 26 ,దమ్మపేట:
ఎల్‌నినో ప్రభావంతో యాసంగి సీజన్‌లో ఎదురయ్యే వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు ముందస్తుగా పంటల సాగు ప్రణాళికపై అవగాహన కల్పించాలని అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ సూచించారు. దమ్మపేట మండలం మండలపల్లి రైతు వేదికలో ఆయన అధ్యక్షతన యాసంగి సాగు ప్రణాళికపై ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖల అధికారులు గ్రామపంచాయతీల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రైతులు, ఆత్మ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తుగా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

రైతు వేదికల్లో కనీస సదుపాయాలు కల్పించాలి

ఆత్మ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు మాట్లాడుతూ రైతు వేదికల్లో అవసరమైన కనీస సదుపాయాల కల్పనకు సంబంధించి రైతు వేదికల వారీగా అంచనాలు (ఎస్టిమేట్లు) రూపొందించి సమర్పించాలని సూచించారు. వాటి ఆధారంగా ఎమ్మెల్యే సహకారంతో



అవసరమైన బడ్జెట్ మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించాలి

ఏడీఏ రవికుమార్ మాట్లాడుతూ రైతుల రిజిస్ట్రేషన్లు, పంటల నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారులను (ఏఈఓలను) ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో యాసంగిలో వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు తగిన సూచనలు అందించాలని తెలిపారు.ఈ సమావేశంలో ఉద్యానవన, విద్యుత్, పశు సంవర్ధక, సాగునీటి శాఖల అధికారులు, వీబీజీ రామ్ జీ అధికారులు, అశ్వారావుపేట డివిజన్ ఏఈఓలు, మండల వ్యవసాయ అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు, వినయ్, అరుణ్‌బాబు, అనూష, ఆత్మ డైరెక్టర్లు, దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఖేత్ బచావో అభియాన్' నిర్వహణ

టీ. మీడియా, అక్టోబర్ 26 ,ముదిగొండ: ముదిగొండ మండలం న్యూ లక్ష్మీపురం గ్రామం పమ్మి క్లస్టర్‌లో నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, ఎరువులను సమతుల్యంగా వాడటం మరియు సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం వంటి ప్రధాన లక్ష్యాలతో 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. అక్టోబర్ 22 నుండి నవంబర్ 30, 2026 వరకు కొనసాగే ఈ ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో ఏఈవో ఇందు భవాని, సర్పంచ్ సలీమా ఖాసీం, పంచాయతీ కార్యదర్శి సురేష్,వార్డు మెంబర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మరియు అనుబంధ శాఖల చైర్మన్లు ఉత్సాహంగా పాల్గొని రైతులకు వ్యవసాయ వనరుల సక్రమ వినియోగంపై అవగాహన కల్పించారు.



పాఠశాలకు బల్లాలు, కుర్చీల అందజేత



⏭ దాత పులసం రామకృష్ణకు ఎంఈవో అభినందన

టీ మీడియా, అక్టోబర్ 26, సింగరేణి (కారేపల్లి):
ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో దాత పులసం రామకృష్ణ ముందుకొచ్చారు. కారేపల్లి మండలం అప్పాయిగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం బల్లాలు, కుర్చీలను వితరణ చేశారు.సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ దండు ప్రవీణ్, మండల విద్యాధికారి దుగ్గిరాల జయరాజు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు పగడాల మంజుల చేతుల మీదుగా బల్లాలు, కుర్చీలను పాఠశాలకు అందజేశారు.ఈ సందర్భంగా ఎంఈవో దుగ్గిరాల జయరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. వారి అవసరాలను గుర్తించి పులసం రామకృష్ణ బల్లాలు, కుర్చీలు అందించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధితో పాటు పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు తమవంతు సహకారం అందించేందుకు ముందుకు రావాలని కోరారు.విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు చేయూతనిచ్చిన పులసం రామకృష్ణను సర్పంచ్ దండు ప్రవీణ్‌తో పాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద పులసం భద్రం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

⏭ కొనుగోలు కేంద్రం, ఆరోగ్య మందిరం, పంచాయతీ భవనం ప్రారంభం

టీ మీడియా, అక్టోబర్ 26, నారాయణఖేడ్:
కల్హేర్ మండల పరిధిలోని మర్డి గ్రామంలో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శేట్కర్, నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.ముందుగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) సహకారంతో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రేడ్–ఏ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,461, సాధారణ రకం ధాన్యానికి రూ.2,441 మద్దతు ధరతోపాటు సన్న వడ్లకు అదనంగా రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
అనంతరం జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, ఉపాధి హామీ పథకం నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనం, రూ.10 లక్షలతో నిర్మించిన మహిళా సమైక్య భవనాన్ని ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభించారు.

గ్రామాభివృద్ధికి మరిన్ని నిధులు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం



అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మర్డి గ్రామానికి ఇప్పటివరకు సుమారు కోటి రూపాయలకు పైగా నిధులు మంజూరు చేసి పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కల్హేర్ మండలంలోని అన్ని గ్రామాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎంపీ సురేష్ కుమార్ శేట్కర్‌తో కలిసి మండల అభివృద్ధికి నిరంతరం సహకరిస్తామని హామీ ఇచ్చారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు చర్యలు

నల్లవాగు ప్రాజెక్టు నీటిని చివరి ఆయకట్టులో ఉన్న ఇందిరానగర్ వరకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల సంబంధిత అధికారులకు సూచించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. రైతులకు సాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, విద్యుత్‌ను వృథా చేయకుండా అవసరమైన మేరకే ఉపయోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యెన్నం విజయలక్ష్మి రవీందర్ రెడ్డి, మర్డి గ్రామ ప్రజలు, కల్హేర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

⏭ తప్పిన పెను ప్రమాదం

టీ మీడియా , అక్టోబర్ 26 , బాపట్ల :
జిల్లా బ్యూరో:బాపట్ల జిల్లాలో ఘోర ప్రమాదం తృటిలో తప్పింది. ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెం సమీపంలోని జాతీయ రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో బస్సులో 17 మంది ప్రయాణికులు ఉండగా, ఇద్దరు మహిళలు గాయపడ్డారు. మిగిలిన ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

నిద్రమత్తే ప్రమాదానికి కారణమా?

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలూరిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు చీరాల నుంచి నరసరావుపేట వైపు ప్రయాణికులతో వెళ్తోంది. అన్నంబొట్లవారిపాలెం వద్దకు చేరుకోగానే బస్సు ఒక్కసారిగా



అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లి బోల్తా పడింది.బస్సు నడుపుతున్న సమయంలో డ్రైవర్ నిద్రమత్తులో ఉండటమే ప్రమాదానికి కారణమని ప్రయాణికులు ఆరోపించారు. బస్సు అదుపుతప్పడాన్ని గమనించిన కండక్టర్, ముందు సీట్లలో ఉన్న ప్రయాణికులు కేకలు వేస్తూ డ్రైవర్‌ను అప్రమత్తం చేసేందుకు ప్రయత్నించినప్పటికీ ప్రమాదాన్ని నివారించలేకపోయారు.

ఇద్దరు మహిళలకు గాయాలు

ఈ ప్రమాదంలో లక్కె వసంత, చిన్నం పుష్పావతి అనే ఇద్దరు మహిళా ప్రయాణికులు గాయపడ్డారు. వెంటనే స్పందించిన హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

ఘటనా స్థలానికి పోలీసులు

సమాచారం అందుకున్న స్థానిక సీఐ నాగభూషణం, ఎస్సై అంకమ్మరావు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు.

అంగన్వాడీ ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి



⏭ సీడీపీఓ ఉమాకు ఐఎఫ్‌టీయూ వినతి

టీ మీడియా,అక్టోబర్26,కామేపల్లి:
అంగన్వాడీ టీచర్లు,హెల్పర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించి,ఏళ్లుగా ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఐఎఫ్‌టీయూ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు షేక్ సుభహాన్ డిమాండ్ చేశారు.తెలంగాణ ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) కామేపల్లి ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సీడీపీఓ ఉమాకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సుభహాన్ మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగులపై అదనపు పనిభారం మోపడం సరికాదన్నారు.ఖాళీగా ఉన్న టీచర్,హెల్పర్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు శిథిలావస్థలో ఉన్న,అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించి కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరారు.సమాన పనికి సమాన వేతనం, పీఎఫ్,ఈఎస్ఐ, ఆరోగ్య బీమా,ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.పదవీ విరమణ ప్రయోజనాలను రూ.10 లక్షలకు పెంచాలని కోరారు.అంగన్వాడీ కార్యకర్తలపై వేధింపుల ఫిర్యాదులపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని,సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి శిరోమణి,నాయకులు లక్ష్మీమణి,విజయ,కమల,వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీరు నిల్వ తో దుర్వాసన



టీ మీడియా, అక్టోబర్ 26, పెబ్బేరు:
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని వినాయక నగర్ కాలనీ నుండి కిష్టారెడ్డి పేట వెళ్ళే దారిలో స్థానిక ఇళ్ల నుంచి మోరీల ద్వారా వచ్చిన మురుగు నీరు వర్షపు నీరు నిలిచిపోవడంతో దుర్గంధ మైన వాసనతో అటు కాలనీ వాసులు ఇటు చేలిమిల్ల వాసులు ఆందోళన చెందుతున్నారు మురుగు నీటిలో దోమల అభివృద్ధి చెంది డెంగ్యూ మలేరియా వ్యాధులు ప్రబలుతాయని ఆగ్రహం వ్యక్తం చేశారు ఇప్పటికైనా వార్డు కౌన్సిలర్ లు మున్సిపల్ చైర్మెన్ కమిషనర్ స్పందించి మురుగు నీటికీ పరిష్కారం దిశగా అడుగులు వేయాలని కాలనీ వాసులు కోరారు.

మృతుడి కుటుంబానికి మేఘన్న అభయ హస్తం



టీ మీడియా, అక్టోబర్ 26. పెబ్బేరు:
వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం లోని తోమాలపల్లి గ్రామానికి చెందిన జంగిడి లాలు అనారోగ్యంతో కొద్ది రోజులుగా బాధ పడుతూ మరణించడం జరిగింది అట్టి వ్యక్తి కి దహన సంస్కారాల నిమిత్తం తో మాలపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు ఎం ఎల్ ఏ తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా వారి ఆదేశాల మేరకు మేఘన అభయ హస్తం కింద 5000 వేల రూపాయలు మృతుని కుటుంబ సభ్యులకు సర్పంచ్ ఆశోక్ కుమార్ చేతుల మీదుగా అందిచడం జరిగింది కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్ కుమార్ తోమాలపల్లి మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ డైరెక్టర్ రామన్ గౌడ్ గ్రామ అధ్యక్షులు బోరింగ్ శ్రీనివాసులు మాజీ అసెంబ్లీ సోషల్ మీడియా కన్వినర్ రమేష్ కుమార్ యూత్ అధ్యక్షులు శివకుమార్ సీనియర్ నాయకులు జి కె రాముడు పెద్ద బాబు చందు పాషా అబ్దులా జి కె కృష్ణయ్య వెంకటన్న తదితరులు పాల్గొన్నారు

వాల్మీకి మహర్షి జయంతి



టీ మీడియా, అక్టోబర్ 26. పెబ్బేరు:
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు సోమవారం మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రామాయణ మహాకావ్యాన్ని రచించి లోకానికి మానవతా విలువలను చాటిన ఆది కవి వాల్మీకి మహర్షి జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు సమాజంలో అందరూ సమానమే అనే భావనను చాటిచెప్పిన మహర్షి ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు ఆయన అందించిన సాహిత్య నైతిక విలువలు చిరస్మరణీయమని కొనియాడారు ఈ కార్యక్రమంలో మున్సిపాల్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి కౌన్సిలర్లు శివ సాయి భాగ్యలక్ష్మి శివ నాయకులు మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ యుగంధర్ రెడ్డి రంజిత్ కుమార్ రణధీర్ రెడ్డి బుర్రమోని రాములు యాదవ్ గొల్ల వెంకట్రాములు రంగం నరసింహ మాలపల్లి రామన్ గౌడు వెంకటయ్య గౌడ్ తిప్పయిపల్లి వీర స్వామి నాయుడు పెద్ద రాములు మోతే రాములు చెలిమిల రాములు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు

⏭ మంత్రి పొంగులేటి

టీ మీడియా ,అక్టోబర్ 26 ,కూసుమంచి:
రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తామని రాష్ట్ర రెవెన్యూ,, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం కూసుమంచి మండలం గోరిల్లపాడు తండాలో రూ. 20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని మంత్రి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామానికి డబల్ రోడ్డు, పొలాలకు వెళ్లే దారులు, స్మశాన వాటికల ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3, లలో అర్హులైన పేదలు ఎవరికైనా పొరపాట్లు ఉంటే సరిదిద్ది ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నవారైనా అర్హులైతే తమ ప్రభుత్వంలో ఇళ్లు ఇవ్వకుండా ఉండేది లేదని మంత్రి స్పష్టం చేశారు. రెండు, మూడు, నాలుగు విడతల్లో అర్హులందరికీ ఇందిరమ్మ



ఇల్లు ఇస్తామని మంత్రి చెప్పారు.
ఈ కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, డీపీవో వినోద్ కుమార్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కూసుమంచి ఎంపీడీవో జస్వంత్ కుమార్, తహసీల్దార్ సైదులు, స్థానిక సర్పంచ్ బానోత్ సరస్వతి, మాజీ ఎంపీపీ బానోతు శ్రీను, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాసు నాయక్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు

50 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు

టీ మీడియా, అక్టోబర్ 26 ,కూసుమంచి:
నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్ పథకం ద్వారా 50 శాతం సబ్సిడీతో గిర్నార్ బి 5 రకం వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు కూసుమంచి మండల వ్యవసాయ అధికారిని వాణి తెలిపారు. విత్తనములు కావలసిన రైతులు భూమి పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారిని సంప్రదించి వేరుశనగ విత్తనాలు పొందవచ్చని వాణి తెలిపారు.

బాలోత్సవ్ -2026 పోస్టర్లను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



టీ మీడియా, అక్టోబర్ 26, ఖమ్మం:
నగరంలో నవంబర్ 11, 12వ తేదీలలో ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్,వారధి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి బాలోత్సవ పోటీలకు సంబంధించిన పోస్టర్లను రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. స్థానిక మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నివాసంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య తో కలిసి బాలోత్సవ్ –2026 పోస్టర్లను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మంలో రాష్ట్ర స్థాయి బాలోత్సవ్ పోటీలను నిర్వహించి పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి కృషి చేయడం అభినందనీయమని తెలిపారు. ఉమ్మడి జిల్లా, రాష్ట్రంలోని నలుమూలల నుంచి పిల్లలు ఈ బాలోత్సవంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య, ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ (ణఐూా)అధ్యక్షులు రాయల్ నాగరాజు,జిల్లా నాయకులు చిక్కుళ్ల వెంకటేష్, పగిల్లపల్లి రాజు,ప్రసాద్ ,రాజేష్ ,భవాని శంకర్, ముకేశ్,సతీష్ తదితరులు పాల్గొన్నారు.మరిన్ని వివరాలకు ,రిజిస్ట్రేషన్ల కోసం ఎవశ్రీశ్రీ: 9177630682,8328277244 నంబర్స్ ని సంప్రదించగలరని ఆర్గనైజింగ్ కమిటీ తెలియచేసింది.

నేరాలకు కేరాఫ్ ఐటీ కారిడార్!



- సైబర్ మోసాల వలలో ఐటీ ఉద్యోగులు

టీ మీడియా, అక్టోబర్ 26, హైదరాబాద్ బ్యూరో:
హైదరాబాద్ నగరానికి ఐటీ రంగం గర్వకారణంగా నిలుస్తున్న ప్రాంతాల్లో నేరాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అంతర్జాతీయ కంపెనీలు, అత్యాధునిక భవనాలతో కళకళలాడే ఐటీ కారిడార్‌లో సైబర్ నేరాలు, భూవివాదాలు, ఆర్థిక మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా నమోదవుతున్నాయి. గచ్చిబౌలి, మాదాపూర్, నార్సింగి, మియాపూర్, రాయదుర్గం ప్రాంతాల్లో నమోదవుతున్న కేసులు ఈ పరిస్థితిని ప్రతిబింబిస్తున్నాయి.
గచ్చిబౌలిలో 1,900 కేసులు
ఈ ఏడాది అక్టోబర్ మూడో వారం వరకు నమోదైన గణాంకాల ప్రకారం.. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో 1,900 కేసులు నమోదయ్యాయి. నార్సింగిలో 1,850, మాదాపూర్‌లో 1,650, మియాపూర్‌లో 1,500, రాయదుర్గంలో 1,200 కేసులు నమోదైనట్లు సమాచారం. రోజుకు సగటున ఆరు నుంచి ఏడు ఎఫ్ఐఆర్‌లు నమోదవుతున్నాయన్న వివరాలు ఈ ప్రాంతాల్లో పోలీసులపై ఉన్న పని ఒత్తిడిని తెలియజేస్తున్నాయి.డయల్ 112కు వచ్చే అత్యవసర ఫిర్యాదుల్లోనూ ఐటీ కారిడార్ ప్రాంతాల నుంచి గణనీయమైన సంఖ్యలో కాల్స్ వస్తున్నట్లు కథనంలో పేర్కొన్నారు. అయితే, ఈ గణాంకాలు నిర్దిష్ట కాలానికి సంబంధించినవని, కేసుల సంఖ్య ఒక్కటే నేరాల తీవ్రతను పూర్తిగా తెలియజేయదని గమనించాలి.
పెట్టుబడుల పేరుతో సైబర్ మోసాలు
ఐటీ కారిడార్‌లో సైబర్ నేరాలు ప్రధాన సమస్యగా మారుతున్నాయి. స్టాక్ మార్కెట్‌లో అధిక లాభాలు వస్తాయంటూ నమ్మించడం, నకిలీ పెట్టుబడి పథకాలు, బ్యాంకింగ్ మోసాల ద్వారా పలువురు బాధితుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ఉద్యోగులు సైతం ఇలాంటి మోసాల బారిన పడుతుండటం గమనార్హం.మరోవైపు, ఐటీ కారిడార్‌లో భూముల ధరలు భారీగా ఉండటంతో భూ లావాదేవీలు, ఆస్తుల యాజమాన్యం, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివాదాలు కూడా పోలీసులకు సవాలుగా మారుతున్నాయి. వీటితో పాటు మహిళలపై వేధింపులు, ఆత్మహత్యలకు సంబంధించిన కేసులు కూడా నమోదవుతున్నట్లు సమాచారం.
పెరుగుతున్న జనాభా.. పోలీసులపై ఒత్తిడి
ఐటీ ఉద్యోగులు, ఇతర రంగాల సిబ్బంది పెద్ద సంఖ్యలో నివసించేందుకు రావడంతో ఈ ప్రాంతాల్లో జనసాంద్రత వేగంగా పెరుగుతోంది. చిన్న స్థలాల్లోనూ అపార్ట్‌మెంట్లు నిర్మించడం, నివాస సముదాయాలు విస్తరించడం వల్ల పోలీసు సేవల అవసరం పెరుగుతోంది.ఫిర్యాదు అందినప్పుడు నిబంధనల ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం కూడా నమోదైన కేసుల సంఖ్యపై ప్రభావం చూపవచ్చు. అయితే, కేసుల పెరుగుదలకు జనాభా, ఫిర్యాదుల నమోదు విధానం, నేరాల స్వభావం వంటి అంశాల పాత్రను అధికారిక గణాంకాల ఆధారంగా విశ్లేషించాల్సి ఉంటుంది.
కొత్త పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలి
పెరుగుతున్న జనాభా, నేరాల స్వభావానికి అనుగుణంగా పోలీసు వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం కనిపిస్తోంది. నార్సింగి వంటి వేగంగా విస్తరిస్తున్న ప్రాంతాల్లో పోలీస్‌స్టేషన్ల విభజన, కొత్త స్టేషన్ల ఏర్పాటు, అదనపు సిబ్బంది నియామకంపై ప్రతిపాదనలు ఉన్నట్లు సమాచారం.సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, పెట్టుబడుల పేరుతో వచ్చే ఆకర్షణీయమైన ఆఫర్ల పట్ల అప్రమత్తం చేయడం, భూవివాదాలపై వేగంగా స్పందించడం వంటి చర్యలు అవసరం. ఐటీ రంగానికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన ఈ ప్రాంతాల్లో ప్రజలకు భద్రత కల్పించేందుకు పోలీసు వ్యవస్థ మరింత సమర్థంగా పనిచేయాల్సిన అవసరం ఉంది.

నేలకొండపల్లి బౌద్ధ స్తూపానికి పూర్వ వైభవం

- అంతర్జాతీయపర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

టీ మీడియా, అక్టోబర్ 26, నేలకొండపల్లి:
ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ పరిధిలోని నేలకొండపల్లిలో ఉన్న మూడో శతాబ్దానికి చెందిన చారిత్రక బౌద్ధ స్తూపానికి పూర్వ వైభవం తీసుకొచ్చి, అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం నేలకొండపల్లిలో బౌద్ధ స్థల సంరక్షణ, పునరుద్ధరణతో పాటు పర్యాటక సదుపాయాల కల్పన పనులకు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు.
దేశంలోనే అతిపెద్ద బౌద్ధ స్తూపాల్లో ఒకటి
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సుమారు 50--55 ఏళ్ల క్రితం నేలకొండపల్లి గ్రామంలో ఈ చారిత్రక బౌద్ధ స్తూపాన్ని గుర్తించినట్లు తెలిపారు. దేశంలోనే అతిపెద్ద బౌద్ధ స్తూపాల్లో ఒకటిగా దీనికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. గత ప్రభుత్వాలు ఈ ప్రాంత అభివృద్ధికి కొన్ని చర్యలు చేపట్టినప్పటికీ, పనులు పూర్తిస్థాయిలో ముందుకు సాగలేదని పేర్కొన్నారు.
పురావస్తు సంపదకు భద్రత కల్పిస్తాం
బౌద్ధ స్తూపం చుట్టూ సుమారు ఒకటిన్నర కిలోమీటరు పరిధిలో గతంలో పురావస్తు శాఖ అధికారులు చేపట్టిన తవ్వకాల్లో అనేక పురాతన వస్తువులు వెలుగులోకి వచ్చాయని మంత్రి వెల్లడించారు. వాటిని భద్రపరిచేందుకు స్థానికంగా తగిన వసతులు లేకపోవడంతో



హైదరాబాద్‌లోని మ్యూజియంలో ఉంచినట్లు వివరించారు. ఈ ప్రాంతంలోని చారిత్రక సంపదను పరిరక్షించడంతో పాటు, సందర్శకులకు గత వైభవాన్ని తెలియజేసేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.
నిపుణులతో విస్తృత స్థాయి సమావేశం
ప్రపంచవ్యాప్తంగా ఉన్న బౌద్ధ మతస్థులు, స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తామని మంత్రి చెప్పారు. బౌద్ధ కట్టడాలపై అవగాహన కలిగిన ప్రముఖ నిపుణులు, సంబంధిత అధికారులను ఆహ్వానించి విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ ప్రాంత అభివృద్ధికి అవసరమైన నిధులు వెచ్చించేందుకు ప్రభుత్వం వెనుకాడబోదని స్పష్టం చేశారు.
పర్యాటక రంగానికి కొత్త దిశ
నేలకొండపల్లి బౌద్ధ స్తూపం బౌద్ధులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా, దేశవిదేశాల పర్యాటకులను ఆకట్టుకునే విధంగా అన్ని చర్యలు చేపడతామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. చారిత్రక వారసత్వ పరిరక్షణతో పాటు పర్యాటక సదుపాయాలను మెరుగుపరిచి, ఈ ప్రాంతాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.
అధికారులు, ప్రజాప్రతినిధుల పాల్గొనడం
ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెరిటేజ్ శాఖ డైరెక్టర్ కుతాడి అర్జున్ రావు, హెరిటేజ్ శాఖ ఉప సంచాలకులు నాగరాజు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, తహశీల్దార్ రాంప్రసాద్, కన్సల్టెంట్ శ్రీనివాస్, టూరిజం డీఈ రామకృష్ణ, జిల్లా పర్యాటక అధికారి సుమన్ చక్రవర్తి, స్థానిక సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కోట మైసమ్మ జాతరకు రూ.32.02 లక్షల ఆదాయం

- గతేడాది కంటే రూ.2.92 లక్షలు అధికం

టీ మీడియా,అక్టోబర్26, సింగరేణి (కారేపల్లి):
ఖమ్మం జిల్లా సింగరేణి మండలం ఉసిరికాయలపల్లిలోని శ్రీ కోట మైసమ్మ తల్లి ఆలయంలో దసరా సందర్భంగా ఐదు రోజుల పాటు నిర్వహించిన జాతర ద్వారా మొత్తం రూ.32.02 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభి రామారావు, ఈవో కట్టుకూరు వెంకటయ్య తెలిపారు.ఈ నెల 23న జాతర ముగియగా,సోమవారం ఖమ్మం దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ ఆర్.సమత సమక్షంలో హుండీతో పాటు వివిధ మార్గాల్లో వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు.గతేడాదితో పోలిస్తే ఈసారి రూ.2.92 లక్షల ఆదాయం పెరిగినట్లు అధికారులు వెల్లడించారు.జాతరలో దుకాణాల వేలం హక్కుల ద్వారా రూ.10.96 లక్షలు,హుండీ ద్వారా రూ.8.02 లక్షలు,పూజా టికెట్ల విక్రయాల ద్వారా రూ.6.34 లక్షలు,షాపుల స్థల కిరాయిల ద్వారా రూ.5.09 లక్షలు,అమ్మవారి చీరల వేలం ద్వారా రూ.57 వేలు,వాహన పూజ లైసెన్స్ ద్వారా రూ.లక్ష



ఆదాయం వచ్చినట్లు తెలిపారు.గతేడాదితో పోలిస్తే పూజల నిర్వహణ ద్వారా రూ.1.39 లక్షలు, వేలం ద్వారా రూ.1.32 లక్షలు,హుండీ ద్వారా రూ.60 వేలు,పూజా లైసెన్స్ ద్వారా రూ.16 వేల ఆదాయం పెరిగిందన్నారు.మరోవైపు షాపుల స్థల కిరాయిల ద్వారా రూ.31 వేలు,అమ్మవారి చీరల వేలం ద్వారా రూ.24 వేల ఆదాయం తగ్గినట్లు పేర్కొన్నారు.జాతర విజయవంతానికి సహకరించిన పోలీసు,దేవాదాయ,వైద్య,పంచాయతీరాజ్ శాఖల అధికారులు,సిబ్బంది, ఉసిరికాయలపల్లి గ్రామస్తులు,వాలంటీర్లు,మీడియాకు ఆలయ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉసిరికాయలపల్లి సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు,పంచాయతీ కార్యదర్శి భూక్య నిరంజన్,ఆలయ ప్రధాన అర్చకులు కొత్తలంక కైలాసశర్మ,దేవాదాయ శాఖ అధికారులు పగడాల మోహన్ కృష్ణ,మూడు మోహన్ చౌహన్,గణితి నారాయణ,పర్సా సత్యసాయిరాం,గ్రామ పెద్దలు బోడా బన్సీలాల్,ఇస్లావత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హైవే పనుల నాణ్యతపై ప్రశ్నలు!

- నాణ్యతా పరీక్షలు ఎవరు చేస్తున్నారు?

టీ మీడియా ,అక్టోబర్ 26 ,ఖమ్మం రూరల్:
పొన్నేకల్ నుంచి కొరవి వరకు చేపడుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనుల నాణ్యతపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజాధనంతో చేపడుతున్న ఈ పనుల్లో నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా? నిర్మాణ సామగ్రికి నాణ్యతా పరీక్షలు నిర్వహిస్తున్నారా? పరీక్షలు నిర్వహించే సంస్థ ఏది? వాటి నివేదికలను సంబంధిత అధికారులు పరిశీలిస్తున్నారా? అనే అంశాలపై ప్రజల్లో చర్చ జరుగుతోంది.
నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా?
జాతీయ రహదారి నిర్మాణంలో ఉపయోగించే మట్టి, కంకర, ఇతర నిర్మాణ సామగ్రి నాణ్యతను నిర్ధారించడంతోపాటు, మట్టి పొరల సాంద్రత, రహదారి పొరల మందం, నిర్మాణ సామగ్రి బలాన్ని నిర్దిష్ట ప్రమాణాల ప్రకారం పరీక్షించాల్సి ఉంటుంది. ఈ పరీక్షల ఆధారంగానే నిర్మాణ పనులు నిర్దేశిత సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా జరుగుతున్నాయా లేదా అన్నది నిర్ధారించవచ్చు.అయితే, పొన్నేకల్--కొరవి మార్గంలో ప్రస్తుతం జరుగుతున్న పనులకు సంబంధించి నాణ్యతా పరీక్షలు ఎవరి పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు? పరీక్షలు చేపడుతున్న ప్రయోగశాల లేదా సాంకేతిక సంస్థ ఏది? క్షేత్రస్థాయిలో తనిఖీలు ఎంత తరచుగా చేస్తున్నారు? పరీక్షల నివేదికలను ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నారా? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాల్సి ఉంది.
నిర్మాణ సంస్థ నివేదికలే ప్రామాణికమా?
నిర్మాణ పనుల నాణ్యత నిర్ధారణలో కాంట్రాక్ట్ నిబంధనలు, సాంకేతిక ప్రమాణాలు, నాణ్యత నియంత్రణ విధానాలకు కీలక ప్రాధాన్యం ఉంటుంది. నిర్మాణ సంస్థ నిర్వహించే



పరీక్షలతోపాటు, ఒప్పంద నిబంధనల ప్రకారం సంబంధిత అధికారులు తనిఖీలు, ధ్రువీకరణలు చేపడుతున్నారా? అవసరమైన సందర్భాల్లో స్వతంత్ర సాంకేతిక సంస్థల ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారా? అన్న విషయాలపై స్పష్టత అవసరం.
నాణ్యతా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పడం మాత్రమే కాకుండా, వాటికి సంబంధించిన రికార్డులు, నివేదికలు, తనిఖీల వివరాలు అందుబాటులో ఉండటం కూడా ముఖ్యం. దీనివల్ల నిర్మాణ పనులపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది.
నాణ్యతపై అధికారులు స్పష్టత ఇవ్వాలి
ప్రజాధనంతో చేపడుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావుండకూడదు. నాణ్యతా ప్రమాణాల అమలుపై అనుమానాలు తలెత్తినప్పుడు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలి.పొన్నేకల్--కొరవి హైవే నిర్మాణ పనులకు సంబంధించి నాణ్యతా పరీక్షలు నిర్వహిస్తున్న సంస్థ, బాధ్యత వహిస్తున్న సాంకేతిక బృందం, పరీక్షల విధానం, తనిఖీల వివరాలు, నివేదికల పరిశీలనకు సంబంధించిన సమాచారాన్ని ఎన్‌హెచ్ఏఐ అధికారులు పారదర్శకంగా వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.